




విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ప్రారంభంలో ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్



# పెద్దిరెడ్డి మాటలు ఉత్తవేనా..!

- తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామని మంత్రి ఉపదేశం
- క్షేత్రస్థాయిలో వ్యవసాయానికి అందని విద్యుత్
- కరెంట్ లేక ఎండుతున్న పంటలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

'జిల్లాలోనున్న 2,09,325 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రూ.979 కోట్లు ఖర్చు చేసి లో ఓల్టేజీ నుంచి హై ఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టంకు మార్చాం..' అంటూ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగస్టు 15వ తేదీన అనంతపురం నగరంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల ప్రసంగంలో చెప్పారు. ఆచరణలో చూస్తే వ్యవసాయానికి తొమ్మిది గంటలు కాదు...గదా ఆరు గంటలు కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక రైతులు పొలాల్లోనే రాత్రీ,పగలు పడిగాపులు కాసే పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎండుతున్న పంటలు**

అనంతపురం రూరల్ మండలం పరిధిలోని మన్నీల గ్రామంలో మొత్తం వ్యవసాయ భూమి 3500 ఎకరాలుంది. ఇందులో సుమారు రెండు వేల ఎకరాల్లో బోరు బావుల కిందనే పంటలు సాగవుతాయి. వ్యవసాయ మోటర్లతోనే ఉద్యానవన పంటలతోపాటు వేరుశనగ వంటి పంటలు సాగవుతున్నాయి. ఈ గ్రామంలో మూడు రోజులుగా సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై రైతులు బుధవారం నాడు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన సైతం చేపట్టారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయంపై సరైన సమాచారం సైతం చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇది ఒక్క మన్నీల గ్రామం పరిస్థితితే కాదు. జిల్లాలోని అనేక గ్రామాల్లోనూ ఇదే విధంగా ఉంది. ఒకవైపు వర్షాల్లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఉన్న పంటనైనా రక్షించకుందామంటే కరెంటు సమసమస్య తీవ్రంగా ఉంది.



విద్యుత్ కోతలతో మన్నీల గ్రామంలో ఎండిన వేరుశగన పంట

**పది ఎకరాల్లో వేరుశనగ ఎండిపోతోంది**

పది ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాం. మూడు లక్షలు రూపాయలు పెట్టుబడి పెట్టాను. ఒకవైపు వర్షాల్లేక సమస్యగా ఉంది. మరో వైపు పంట ఎండిపోకుండా కాపాడుకుందామంటే బోరు బావుల్లో నీరున్నా పంట పెట్టుకోవడానికి వీల్లేకుండా కరెంటు ఉండటం లేదు. ఎప్పుడు వస్తుందో కూడా తెలియక పొలాల్లోనే రాత్రీపగలు పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. మంచి ఊడలు దిగే సమయంలో నీళ్ల లేక పోతే పంట దిగుబడి ఏ మాత్రం అందదు.

**ఓబులయ్య, రైతు, మన్నీల గ్రామం.**

**వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి**

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందివ్వాలి. ఏ సమయంలో విద్యుత్ సరఫరా అందిస్తామన్నది ముందుగానే సమాచారం అందివ్వాలి. దీంతో రైతులు ఆ సమయానికి రైతులు పొలాలోకెళ్లి పంటకు నీళ్ల పెట్టుకునే పరిస్థితి నెలకొంది.

**రామాంజినేయులు,**
**జిల్లా నాయకులు ఎపి రైతు సంఘం.**

# ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

**మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్**

**తాడిపత్రిలో ఎస్ఎఫ్ఐ 'విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర' ప్రారంభం**

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలే మార్గం అని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ తెలిపారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు చేపట్టిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర బుధవారం నాడు తాడిపత్రిలో ప్రారంభం అయ్యింది. తాడిపత్రి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన యాత్రను గేయానంద్ జెండా ఊపి ప్రారంభించారు. మొదటి రోజు నంద్యాల రోడ్డు మీదుగా మండలంలోని చుక్కలూరు, ఇగూడూరు గ్రామాల మీదుగా యాడికి, రాయల చెరువు, క్రిష్టిపాడు గ్రామాల మీదుగా రాత్రి గుత్తికి చేరుకుంది. సైకిల్ యాత్రకు అన్ని ప్రాంతాల్లోనూ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ ప్రభుత్వం పేదలను విద్యకు దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేజీబీవీల్లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేరన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం అడుగడుగునా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. దీనిని నిరసిస్తూ ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు విద్యార్థులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నేటికీ అందలేదన్నారు. జీవో నెంబర్ 77ను తీసుకొచ్చి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేశారన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్ మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివద్ధి చేయాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర తాడిపత్రి, గుత్తి, గుంతకల్, ఉరవకొండ, కనేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు మీదుగా అనంతపురం వరకు కొనసాగుతుందని చెప్పారు. 350 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసి విద్యార్థుల సమస్యలను అధికారుల దష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు వరుణ్, నాయకులు సిద్ధార్థ, గిరిబాబు, సునీత, శివ, భీమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం పోరాటం : సిపిఎం

**ప్రజాశక్తి-గుంతకల్లు, గుంతకల్లు రూరల్**



పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు

హంద్రీనీవా కాలువ పనులను పూర్తి స్థాయిలో చేసి జిల్లా రైతులకు సాగునీరించేంత వరకు పోరాటం కొనసాగుతుందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పిల్ల కాలువల ద్వారా సాగు,తాగునీరు అందించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 2వ రోజు బుధవారం గుంతకల్లు మండలానికి చేరుకుంది. మండలంలోని నెలగొండ, మల్లేనిపల్లి, దోనిముక్కుల గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రైతు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాగులపాడు లిఫ్ట్ ద్వారా సాగునీరిస్తే ప్రత్యక్షంగా 7000 ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి మరో ఏడు వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గత మూడు సంవత్సరాల క్రితం గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి రూ.600 కోట్ల నిధులతో కాలువ పనులను 2022 జనవరి నాటికి పూర్తి చేస్తామంటూ శంకుస్థాపన చేశారన్నారు. ఈ పనులు జరక్కపోగా, ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన శంకుస్థాపన రాయి కూడా కనిపించలేదన్నారు. సాగునీరు లేక రైతులు పొలాలు బీడుగా ఉండే పరిస్థితి నెలకొందన్నారు. గుంతకల్లు, వజ్రకరూరు మండలాలలో వర్షాలు లేక రైతులు నిత్యం కరువు కాటకాలకు గురవుతున్నారని చెప్పారు. సాగునీరు అందింతే రైతులు పొలాలు సాగు చేసుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రభుత్వాలు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించి వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో పిల్ల కాలువలు తవ్వించి రాగులపాడు ఎత్తిపోతుల పథకం ద్వారా సాగునీరు అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సాగునీటి కోసం గుంతకల్లు ఆర్డీవో కార్యాలయం ముందు గురువారం నాడు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.తిమ్మప్ప, సాకే నాగరాజు, కసాపురం రమేష్, విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ గౌతమి

స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు అధికారులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1928లో మద్రాసులో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని తుపాకీకి ఎదురు నిలిచి కాల్చుమని సవాలు చేశారని తెలిపారు. 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ఎన్నిక అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ పుణ్యవతి, ఏవో శ్రీధర్, బీసీ వెల్ఫేర్, పాల్గొన్నారు.

**పోలీసు కాన్ఫిరెన్స్ హాల్లో...**

**అనంతపురం క్రైం :** దేశం, ప్రజల కోసం నిరంతరం శ్రమించిన యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకష్ణ, డీఎస్పీలు ఎం.ఆంథోనప్ప, జి.ప్రసాదరెడ్డి, యు.నరసింగప్ప, బి.శ్రీనివాసులు, మునిరాజ్ పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో..**

సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమా అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ ఇంతియాజ్ అహ్మద్, జిఎం.బాషా, శ్రీవిజయ, సరస్వతి, బాలచంద్ర, మల్లి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుల ముందస్తు అరెస్ట్

**అనంతపురంకలెక్టరేట్ :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిఐటియు ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళుతున్న సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ కార్మికుల యూనియన్ నగర అధ్యక్షులు ఎర్రిస్వామిలను మూడవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులపై పోలీసులు గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారు. రాయదుర్గం, గుంతకల్, తాడిపత్రి తదితర మున్సిపాలిటీ కేంద్రాల్లో కార్మికులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టైన వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

## ఉచిత కంటి వైద్యశిబిరం

**యాడికి :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో శాంతి రామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 80 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు.

## ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ

**యాడికి :** మండల కేంద్రంలోని ప్యారడైజ్ స్కూల్ వెనుక నూతనంగా బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రాయల్ కన్వెన్షన్ హాల్ పనులకు బుధవారం నాడు భూమిపూజ చేశారు. బలిజ సంఘం అధ్యక్షులు బండారు హరినాథ్‌బాబు ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొంబాయి రమేష్ నాయుడు, దాసరి శ్రీనివాస్, గిరి, కంబగిరి రామంజి, రాయుడు పాల్గొన్నారు. ఫంక్షన్ హాల్‌కు కాసా సుశీలమ్మ జ్ఞాపకార్థంగా కాసా చంద్రమోహన్ 30 సెంట్లు భూమిని బలిజ సంఘానికి వితరణగా ఇచ్చారు.

## గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

**మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి**

**అనంతపురం కలెక్టరేట్ :** రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం టిడిపి అర్బన్ కార్యాలయంలో క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ పరిశీలకులు రమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్‌కు ఇక నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జులు బిఎల్ఓ, బిఎల్ఎలను జత చేసి వార్డులలో పని చేయించాలన్నారు. రాబోయే ఎన్నికల యుద్ధానికి సన్నద్ధం కావాలని, వార్డులలో అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని, 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాటించాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో అరాచకం తాండవిస్తోందని, ఎక్కడ చూసినా పార్టీ శ్రేణులపై దాడులు పెరిగిపోయాయని, మన పిల్లల భవిష్యత్తు కోసం టిడిపిని గెలిపించాలని కోరారు. పార్టీ పరిశీలకులు రమణారెడ్డి మాట్లాడుతూ అన్ని కమిటీలు పని చేస్తే గెలుపు సాధ్యమని, ఓటర్ వెరిఫికేషన్ హౌస్ మ్యాపింగ్‌లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## కలెక్టరేట్లో ఉద్యోగుల గ్రీవెన్స్

**అనంతపురం కలెక్టరేట్ :** ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగుల గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలకు వెంటనే పరిష్కారం చూపించాలని ఇన్‌ఛార్జి డిఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 31 మంది అర్జీలను అందజేశారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి డిఆర్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, కలెక్టరేట్ ఏవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వివరాలతో న్యాక్ రిపోర్టు

**జెఎన్‌టియు విసి రంగజనార్ధన**



జెఎన్‌టియు సిబ్బందిని అభినందిస్తున్న విసి రంగజనార్ధన

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం జెఎన్‌టియు నేషనల్ అస్సెమెంట్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్)కు సెల్ఫ్ స్టడీ నివేదికను విజయవంతంగా సమర్పించామని జెఎన్‌టియు ఉపకులపతి జి. రంగజనార్ధన తెలిపారు. బుధవారం నాడు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో యూనివర్సిటీ అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం విసి మాట్లాడుతూ మార్చిలో ఇన్స్టూషనల్ ఇన్ఫర్మేషన్ క్వాలిటీ అస్సెమెంట్ సమర్పించామన్నారు. దీనిని జూన్‌లో అంగీకరించారని తెలిపారు. బుధవారం నాడు సెల్ఫ్ స్టడీ రిపోర్టును సమర్పించామని చెప్పారు. దీనికి సంబంధించి డిజిటల్ ఎవాల్యూషన, వెరిఫికేషన్‌ను న్యాక్ టీమ్ చేస్తారనన్నారు. అనంతరం న్యాక్ ఫిజికల్ టీమ్ యూనివర్సిటీని సందర్శించి, గ్రేడ్ ఇస్తారన్నారు. న్యాక్ నివేదిక విజయవంతంగా ఇవ్వడంలో కషి చేసిన ఐ క్యూసి డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, బృందం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ఇ.కేశవరెడ్డి, బి.ఈశ్వర్ రెడ్డి, సి.శోభాబిందు, పి.సుజాత, ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ , వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి తదితరులు పాల్గొన్నారు.

**ఆంధ్రకేసరికి నివాళి**

ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులుకు నాడు బుధవారం అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవనంలో ఘన నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విసిరంగజనార్ధన, ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సిశశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే వందశాతం పూర్తి చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024లో భాగంగా ఈనెల 25వ తేదీలోపు వంద శాతం తప్పనిసరిగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి స్పెషల్ సమ్మర్ రివిజన్-2024కి సంబంధించి ఇంటింటి సర్వే, వివిధ అంశాలపై ఈఆర్ఓలు, ఎఇఆర్ఓలు, ఎలక్షన్ డిప్యూటీ తహాశీల్దార్‌లు, బూత్ లెవెల్ ఆఫీసర్‌లతో బుధవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024లో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 98.8 శాతం ఇంటింటి సర్వే పూర్తి అయ్యిందన్నారు. రెండు రోజుల్లోగా దీనిని వందశాతం పూర్తి చేయాలన్నారు. అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల కమిషన్ నుంచి ఏ సూచనలు వచ్చినా బిఎల్ఒలకు తెలియజేయాలన్నారు. ఈనెలాఖరులోపు రీవెరిఫికేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, ఆర్డీవోలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, రవీంద్ర, ఏపీఐఐసీ జెడ్ఎమ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మోటార్లకు విద్యుత్ ఇవ్వాలి

- ప్రకృతి వైపరీత్యానికి తోడు ప్రభుత్వ నిర్లక్ష్యం
- తక్షణం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
- మన్నీలలో ఎండుతున్న పంటల పరిశీలన



ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రకృతి వైపరీత్యం, వర్షాభావంతో పంటలు ఎండిపోతుంటే... వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందివ్వక మరోరకంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని మన్నీల గ్రామ పరిధిలో బోర్ల కింద సాగుచేసిన పంట విద్యుత్ సరఫరా అంతరాయంతో ఎండిపోతోంది. ఈ పంటలను సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. తమ గ్రామం పరిధిలో మూడు రోజులుగా కరెంటు లేకపోవడంతో బోర్ల కిందనున్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది గంటలు కరెంటు ఇస్తామని చెప్పి ఆరు గంటలకు కూడా సక్రమంగా రావడం లేదని రైతులు తెలిపారు. అది కూడా ఎప్పుడు వస్తుందో.. రాదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం ఒకవైపు గొప్ప ప్రకటనలు చేస్తోందని తెలిపారు. ఆచరణలో చూస్తే కరెంటు ఎప్పుడు వస్తుందో.. లేదో కూడా తెలియకుండా ఉందని చెప్పారు. వర్షాల్లేక ప్రకృతి వైపరిత్యం రైతులను ఒక రకంగా దెబ్బతిస్తే... ప్రభుత్వం వైఫల్యంతో మరో విధంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందివ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజినేయులు, రైతులు లక్కప్ప, చంద్రశేఖర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఇటుకల పల్లి సబ్‌స్టేషన్ వద్ద రైతులు ధర్నా రాస్తారోకో**

వ్యవసాయానికి 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం ఇటికలపల్లి సబ్ స్టేషన్ వద్ద ధర్నా రైతులు ధర్నా నిర్వహించారు. గంట పాటు హైవే రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున మాట్లాడుతూ నెల రోజుల నుంచి మన్నీల, కందుకూరు, కృష్ణంరెడ్డిపల్లి, ఇటుకలపల్లి, ఆకుతోటపల్లి, పూలకుంట, చియ్యేడు, చిన్నకుంట గ్రామాల పంట పొలాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వేరుశనగ, వరి, దానిమ్మ, చీని, కాయగూరలు తదితర పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. అనేకసార్లు ఏఈ, ఏడీ, డిఇలకు విన్నవించిన స్పందన లేదన్నారు. ఏఈ, డిఈలు మాట్లాడుతూ 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సక్రమంగా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, సిపిఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకష్ణ, మండల నాయకులు నాగరాజు, ఇటుకలపల్లి మాజీ సర్పంచ్ అన్నగిరి పెద్దిరెడ్డి, నాయకులు అక్కులప్ప, రాజేంద్ర, ఆకుతోటపల్లి ఎంపీటీసీ సోమశేఖర్ రెడ్డి, మన్నిల గ్రామ రైతులు సతీష్, కొండయ్య, హరి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ కోతలపై ప్రజాప్రతినిధులు స్పందించాలి**

వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధించడం ఆపాలని, నాణ్యమైన విద్యుత్ అందించాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ కోతల సమస్యను వెంటనే పరిష్కరించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో 2, 3 గంటలే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అవుతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితులలో రైతులు సబ్ స్టేషన్ విద్యుత్ కార్యాలయల ముందు రైతులు ఆందోళలు చేస్తున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం ప్రకటించిన విధంగా వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా అందించాలని కోరారు.



జీడిపల్లి రిజర్వాయర్‌లోకి చేరుతున్న కృష్ణా జలాలు

## జీడిపల్లికి చేరిన కృష్ణా జలాలు

**బెళుగుప్ప :** కర్నూలు జిల్లాలోని మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి బుధవారం కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతూ వచ్చి మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌లోకి చేరాయని హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు తెలిపారు. ఆ ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన భార్గవ్‌కు బొకే అందజేస్తున్న అధికారులు

## జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన భార్గవ్

**అనంతపురం :** నగరంలోని రిజిస్టర్ కార్యాలయంలో రెండు నెలల క్రితం జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ మూర్తి ఎసిబి అధికారులకు పట్టుబడడంతో సస్పెండ్ అయిన విషయం విదితమే. అప్పటినుంచీ ఖాళీగా ఉన్న ఆ పోస్టులో బుధవారం గ్రూప్-1 క్యాడర్ అధికారి భార్గవ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈయనకు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ టిజి రెడ్డి, ఇస్మాయిల్, సిబ్బంది, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి అభినంధనలు తెలిపారు.

## పుట్లూరు సిఐగా సుబ్రమణ్యం



**పుట్లూరు :** పుట్లూరు సిఐగా సుబ్రమణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా పని చేస్తున్న వేణుగోపాల్ అనంతపురం విఆర్‌కు బదిలీ గాగా నంద్యాల జిల్లా ఆత్మకూరు సిఐగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యం బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ప్రజలకు సూచించారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోవింద్‌కు పితృవియోగం

**అనంతపురం :** అనంతపురం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోవింద్ తండ్రి దాసరి పెద్ద చౌడప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్ రామాంజనేయులుతో కలిసి చౌడప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## సిఐటియు నాయకునికి ముందస్తు నోటీసు


**రాయదుర్గం :** మున్సిపల్ కార్మికుల సమస్యలపై బుధవారం విజయవాడలో జరుగుతున్న 'చలో విజయవాడ' కార్యక్ర మం సందర్భంగా ముందస్తుగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జునకు పోలీసులు నోటీసులు అందజేశారు.

## బిఎల్‌ఒల సమావేశం

**పుట్లూరు :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ యోగానందరెడ్డి అధ్యక్షతన బిఎల్‌ఒల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ జాబితా తయారీలో ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. తప్పులు లేకుండా ఓటర్ జాబితా తయారు చేసే బాధ్యత బిఎల్‌ఒ లపై ఉందని సూచించారు. సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, అలా కాకుండా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, హౌసింగ్ ఎఇ లోకేష్‌కుమార్, ఎఎస్‌ఓ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

**బుక్కరాయసముద్రం :** రోగులకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్‌ఒ యుగంధర్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని అమ్మవారిపేట గ్రామంలో చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్‌ను బుధవారం డిఎంహెచ్‌ఒ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ మందులు అందుతున్నాయా లేదా, రక్త పరీక్షలు ఎంతమందికి చేశారని ఆరా తీశారు. అలాగే ఆశా కార్యకర్తలు ఈ ఆశా యాప్‌లో డేటా నమోదు చేస్తున్నారో లేదో తనిఖీ చేశారు. ఎన్‌సిడిసిడి సర్వేకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే పిల్లలకు సంబంధించిన టీకాల నమోదు యు విన్ పోర్టల్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహర్ష, ఎఎన్‌ఎం నాగరత్నమ్మ, సిహెచ్‌ఒ రమహారిక, ఎంపిహెచ్‌ఎం వెంకటేష్, డిఇఒ పీరా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ యుగంధర్

# తాడిపత్రిలో అభివృద్ధి పనులకు జెసి భిక్షాటన

**ప్రజాశక్తి-తాడిపత్రి**

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని, దీంతో సొంత నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పట్టణ ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో భిక్షాటన చేపట్టినట్లు జెసి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎల్లనూరు రోడ్డు సర్కిల్, కూరగాయల మార్కెట్ సర్కిల్‌లో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొత్త మార్కెట్ వద్ద అండర్ డ్రైనేజీ పైపులైన్ లీకేజీ కారణంగా పరిస్థితి అధ్వానంగా మారిందని, అలాగే మాంసం మార్కెట్ లోని డ్రైనేజీ నీరు మొత్తం పైపులైన్ లోకి వదలడం కారణంగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. మాంసం మార్కెట్ నిర్మాణం పూర్తి కాకున్నా కొందరు స్వార్థం కోసం ప్రారంభించి ఈ దుస్థితి తెచ్చారని ఆరోపించారు. తాడిపత్రి మున్సిపాలిటీలో డబ్బులు ఉన్నా పనులు చేయడానికి ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. దీంతో ఏ పని చేయాలన్నా సొంత డబ్బులతోనే చేయాలి కాబట్టి పైపులైన్ మరమ్మతులు కూడా సొంత నిధులతోనే చేయాల్సి వస్తోందన్నారు. అయితే ఇందులో పట్టణ ప్రజలను కూడా భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో భిక్షాటన కార్యక్రమం తలపెట్టానని తెలిపారు. అధికారులు పనులు చేయడం లేదని, దీంతో తానే దగ్గర ఉండి పనులు జరిపిస్తానని జెసి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



ఆర్టీసీ బస్సులో భిక్షాటన చేస్తున్న జెసి ప్రభాకర్ రెడ్డి

# 2024 ఎన్నికలతో టిడిపి భూస్థాపితం

## మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

2024 ఎన్నికలతో టిడిపి భూస్థాపితం కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం వైసిపి జెసిఎస్ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విశేష ప్రజాదరణ లభిస్తుందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. జాతీయ స్థాయి సర్వేలు సైతం రాష్ట్రంలో మళ్లీ వైసిపిదే అధికారం అని చెబుతున్నాయన్నారు. జెసిఎస్, సచివాలయ కన్వీనర్లకు పార్టీ రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ చేయించిందని, త్వరలోనే గృహసారథులకు చేయిస్తారని తెలిపారు. వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు మరింత బాధ్యతగా పని చేసి నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాల జెసిఎస్ కన్వీనర్లు తేజోనాథ్, వెంకటరెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆసిఫ్, సచివాలయ కన్వీనర్లు, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ

**కార్పెంటర్ల అభివృద్ధి, సంక్షేమానికి కృషి**

నియోజకవర్గంలో కార్పెంటర్ల సంక్షేమానికి కృషి చేస్తానని విశ్వేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు. కార్పెంటర్స్ యూనియన్ నాయకులు పట్టణంలో విశ్వను కలిసారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు మహబూబ్‌బాషా, అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, జాయింట్ సెక్రటరీ రాజుఆచారి, తదితరులు వారి ఇబ్బందులను ఆయనకు వివరిం చారు. ప్రధానంగా యూనియన్ కార్యాలయం ఏర్పాటుకు 5 సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి లలిత, వైస్ ఎంపిపి నరసింహులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, తిప్పయ్య, నాయకులు బసవరాజు, కోదండరాం, వార్డు సభ్యురాలు పద్మావతి, బ్యాళ్ల ప్రసాద్, వేమన్న, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎండిన వేరుశనగ పంట పరిశీలన

**ప్రజాశక్తి-శింగనమల**

అనంతపురాన్ని కరువు జిల్లాగా ప్రకటించి వేరుశనగ పంట సాగు చేసిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎండిపోతున్న వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మండలంతో పాటు జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో సాగు భూములు బీడు భూములుగా మారాయని, జిల్లాలో 9.60 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా 5 లక్షల ఎకరాల్లో మాత్రమే వేశారని తెలిపారు. జిల్లాలో 2.31 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 1.16 లక్షల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ పంట సాగైందని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లలో అనేక పంటలు దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. కావున వేరుశనగ, పత్తి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు ఇవ్వాలని, బీడు భూమి పెట్టిన రైతులకు రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అంతర పంటలకు ఉచితంగా పెసర, ఉలవ, అలసంద, రాగులు, కొర్రలు, జొన్నలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప, నాగేంద్ర, పుల్లన్న, భాస్కర, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎండిన వేరుశనగ పంట పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

# సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-గార్లదిన్నె**

ప్రజలకు సుపరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. మండల పరిధిలోని బూదేడు, కృష్ణాపురం, సంజీవపురం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి నవరత్నాలు ద్వారా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో బడుగు, బలహీన వర్గాల వారికి అందజేసిన సంక్షేమ ఫలాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, ఎంపిడిఒ తేజోష్ణ, తహశీల్దార్ ఉషారాణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫొటో : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

# చౌక బియ్యం పక్కదారి పడితే చర్యలు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు తప్పవు అని తహశీల్దార్ రమాదేవి హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ తహశీల్దార్ రమాదేవి, కో ఛైర్మన్, ఎంపిపి సునీత మాట్లాడుతూ గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతామన్నారు. బియ్యం సరఫరాలో ఎక్కడైనా అవకతవకలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నా రు. మండలంలో గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు సక్రమంగా భోజనం అందించేలా చర్యలు చేపడుతామన్నారు. ప్రతినెలా ఫుడ్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపిడిఒ విజయభాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి నీటి పథకం నిర్వహణకు నిధులు కేటాయించాలి

**గార్లదిన్నె :** శ్రీసత్యసాయి తాగునీటి పథకం నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ బుధవారం తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ తేజోష్ణకు ఈ పథకం కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వెయ్యి గ్రామాల్లో 10 లక్షల మందికి తాగునీరు అందించేందుకు 572 మంది కార్మికులు పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేస్తున్నా మన్నారు. అయితే గత 5 నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. అలాగే పైపులైన్, బోర్ల మరమ్మతులు, నీటి ట్యాంకులు శుభ్రపరచడం వంటి పనులకు నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో ఈ నెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సచివాలయం తనిఖీ

**ఉరవకొండ :** సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై మెరుగైన సేవలు అందించాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని హావలిగి సచివాలయం-2, కరకముక్కల సచివాలయాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు అందిస్తున్న సేవలు, లబ్ధిదారులు పొందిన సేవలు, అర్హత ఉండి సాంకేతిక కారణాలతో సేవలు పొందని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కరణం భీమిరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.



గేట్స్‌లో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

## గేట్స్‌లో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం


**గుత్తి :** పట్టణ సమీపంలోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో బుధవారం పాలిటెక్నిక్ కళాశాలను కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యకు నోచుకునేవారు కాదని, అలాంటి వారికి పాలిటెక్నిక్ విద్య అందుబాటులో ఉండేందుకు తాము కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలో ఉత్తమ విద్య అందిస్తామన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సురయ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపు పై బహిరంగ చర్చకు సిద్ధం

**అనంతపురం :** ఉరవకొండ నియోజకవర్గంలో టిడిపి ఓట్లు తొలిగించారని దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ విషయంపై ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని వైసిపి యువజన విభాగం నాయకులు ప్రణయ్‌రెడ్డి సవాల్ తెలిపారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ముఖ్యనేత తనయుడి ప్రమేయంతో టిడిపి ఓట్లు తొలగించడంతోనే జడ్పీ సిఇఒలు సస్పెండ్ అయ్యారని టిడిపి నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం తగిన ప్రొసీజర్ పాటించలేదని ఎన్నికల కమిషన్ వారిని సస్పెండ చేశారని తెలిపారు. టిడిపి నేతల దొంగ ఓట్లపై ఆధారాలతో ఉరవకొండ టవర్ క్లాక్ వద్ద చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల వినతి

**గుత్తి :** ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎ) సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుమతి ఇచ్చి సహకరించా లని మండల విఆర్‌ఎల సంఘం నాయకులు కోరారు. జగనన్నకు చెబుదాం చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతి కోరుతూ బుధవారం తహశీల్దార్ మహబూబ్ బాషాకు విఆర్‌ఎలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, నారాయణస్వామి మాట్లాడుతూ విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు, 60 ఏళ్ల పైబడిన ప్రతి విఆర్‌ఎ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డిఎతో కలిపి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగదీష్, రామ్‌ప్రసాద్, సుధాకర్‌బాబు, వినోద్, యుగంధర్, రమణ, సుధాకర్ పాల్గొన్నారు.



హంద్రీనీవా కాలువలో గంగ పూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, కమిషనర్

## హంద్రీనీవా కాలువలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగ పూజ

**గుంతకల్లు :** పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ వద్ద ఉన్న కాలువకు హంద్రీనీవా నీరు వచ్చిన సందర్భంగా బుధవారం మున్సిపల్ ఛైర్ పర్సన్ భవానీ, వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గంగపూజ చేశారు. అనంతరం సమ్మర్ స్టోరేజ్‌లోకి కృష్ణా జలాలను సరఫరా చేసే పంపింగ్ మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లోకి నీటిని సరఫరా చేయడంలో అలసత్వం చేయరాదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు, డిఇ రామ్మూర్తి, ఎఇ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, లైటింగ్ సూపర్‌వైజర్ అబ్దుల్ బాషా, ఇంజినీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలి

**గుంతకల్లు రూరల్ :** ఖరీఫ్ సీజన్‌లో కేవలం 13 వేల హెక్టార్లలో పంట సాగైందని, కావున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలని ఎఒ కె.స్వాతి సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావం కారణంగా పంటల దిగుబడి తగ్గిపోతుందన్నారు. కావున ప్రతి రైతు స్వల్ప కాలిక పంటలు సాగు చేసుకొనేందుకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో రైతులకు ప్రత్యామ్నాయ విత్తనలు అందిస్తుందని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**కుందుర్పి :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి కమల నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని అప్పాజిపాళ్యం గ్రామంలో రూ. 3 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్లను బుధవారం ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి ఉషశ్రీచరణ్ చొరవతో మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచి గంగాధర్, సచివాలయ మండల కన్వీనర్ రాము, కాంట్రాక్టర్ తిప్పేస్వామి, వైసిపి నాయకులు అప్పాజీపాలెం సురేష్, రఘు, శివప్ప, కొలిమి పాల్యం, ప్రతాప్, మంజు, తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు





చంద్రయాన్-3 విజయం పట్ల నగరంలోని వైసిపి కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే అనంత, నాయకులు, ఇస్రో పూర్వ ఛైర్మన్ రాధాకృష్ణతో డాక్టర్ అక్బర్ సాహెబ్

# చంద్రయాన్-3 విజయం పట్ల హర్షం

**అనంతపురం :** చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ అక్బర్ సాహెబ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచి చంద్రయాన్-3ని ప్రయోగించడం సంతోషంగా ఉందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారతదేశం నిలవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అనంత తెలిపారు. చంద్రయాన్ విజయవంతం దేశానికి గర్వకారణమని డాక్టర్ అక్బర్ సాహెబ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ దిగ్గజ దేశాలు సాధించలేని విజయాన్ని భారత ఇస్రో శాస్త్రవేత్తలు సాధించడం గర్వకారణమని కొనియాడారు. అనంతరం వారు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.



రాయదుర్గంలో విద్యార్థుల జాతీయ జెండా ప్రదర్శన

**జాతీయ జెండా ప్రదర్శన**

**రాయదుర్గం :** చంద్రయాన్-3 సఫలం కావాలని కాంక్షిస్తూ బుధవారం పట్టణంలోని వాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 500 మీటర్ల జాతీయ పతాకాన్ని పుర వీధుల్లో ప్రదర్శిస్తూ ఊరేగించారు. అలాగే డి.హీరేహాల్ మండలంలోని కల్యం గ్రామంలో బాల మేధావి పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు.

# ఈ క్రాప్ నమోదు 15లోపు పూర్తవ్వాలి : జెడిఎ

**ప్రజాశక్తి-ఉరవకొండ**

2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 15వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి (జెడిఎ) ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో వ్యవసాయ అధికారులు చేపట్టిన ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు వంకలపాటి దేవేంద్రప్ప పొలంలో కంది పంట నమోదు విషయంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. సాంకేతిక సమస్యల కారణంగా పంట నమోదును వేగవంతంగా చేయలేకపోతున్నట్లు వై.సుబ్బారావు, సిబ్బంది ఆమె దృష్టికి తీసుకురావ డంతో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులందరికీ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విఆర్‌ఒ లు, ఆర్‌బికె సిబ్బంది సమక్షంలో పంట నమోదు చేయాలన్నారు. రైతులు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ శుభకర్, ఆర్‌బికె సిబ్బంది గోపాల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.



ఈ క్రాప్ నమోదును తనిఖీ చేస్తున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

**నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి**

ఈ క్రాప్ నమోదును వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్ హరిప్రసాద్ ఆదేశించారు. పంట నమోదు, పంట కోత ప్రయోగాలపై బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎఒ శుభకర్ ఆధ్వర్యంలో విఆర్‌ఒలు, ఆర్‌బికె సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ హేమలత ఆయా అంశాలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

# చలో విజయవాడ పోస్టర్లు విడుదల

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీ చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక జడ్పి హైస్కూల్ మైదానంలో 'చలో విజయవాడ' గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు, పనికి తగ్గ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. హై స్కూల్స్‌లో 9, 10 తరగతులకు అదనంగా వర్కర్లను కేటాయించాలని, వంట చేసే సమయంలో ప్రమాదాలకు గురైన కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, నూతన విద్యా విధానం అమలులో భాగంగా స్కూల్స్‌ను మెర్జ్ చేయడంతో ఉపాధి కోల్పోయిన వారికి ఉపాధి కల్పించాలని, వంటకు అవసరమైన పాత్రలు ఇవ్వాలని, తదితర సమస్యలపై చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు జయమ్మ, సుజాత, మారెక్క, అక్కమ్మ, హసీనాబేగం, పాల్గొన్నారు



చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగమణి, కార్మికులు

# భవన నిర్మాణాలను వేగవంతం చేయండి

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

సచివాలయాన్ని పూర్తి చేసి ప్రజ లకి అందుబాటులోకి తేవాలని ప్రత్యేకాధికారి శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆమె నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జగనన్న లే అవుట్ కాలనీని పరిశీలించి నిర్మాణాలు వేగవంతం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపిడిఒ బి.విజయ భాస్కర్, హౌసింగ్ ఎఇ రాజశేఖర్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధి విస్తరణ అధికారి దామోదరమ్మ ఉన్నారు.



సచివాలయాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీదేవి

## టిడిపి కార్యకర్తలకు బండారు శ్రావణిశ్రీ పరామర్శ

**శింగనమల :** పాత కక్షల నేపథ్యంలో మండల పరిధిలోని వెస్ట్ నరసాపురం పంచాయతీ నాగులగుడ్డం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు లక్ష్మీనారాయణ, శివ, కిట్టన్న, గంపన్నలను అక్రమంగా అరెస్టు చేసి సబ్ జైలుకు తరలించడంతో బుధవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ జైలుకు వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట చిదంబరి దొర, మండల కన్వీనర్ గుప్తా, ఆదినారాయణ, చిదానందనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



సబ్‌జైలు ఆవరణలో టిడిపి కార్యకర్తలతో బండార శ్రావణిశ్రీ

# నేరాలు ఘోరాలు

## బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి దుర్మరణం

**పెద్దవడుగూరు :** మండల పరిధిలోని అప్పేచెర్ల సమీపంలో 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకల తిప్పయ్య(42) దర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన తిప్పయ్య సొంత పనుల నిమిత్తం గుత్తికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా అప్పేచెర్ల సమీపంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గుత్తి :** మండల పరిధిలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన జితేంద్రబాబు, బన్నీ గుంతకల్లులో జరిగే బంధువుల వివాహానికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. అయితే రజాపురం శివారులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద వేగంగా వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్క నున్న మట్టికుప్పను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడగా 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జితేంద్రబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.